# వనదేవత

స్వరోచి మహారాజు మృగయాలోలుడై అరణ్యానికి బయలుదేరాడు. ధనుర్బాణాలు దాల్చి వనములో ప్రవేశిస్తున్న స్వరోచిని చూసి ముందే భయంతో నలుదిక్కులకి పారిపోతున్నాయి జంతువులు. ఎడతెగని బాణవర్షంతో అడవిలోని ఎన్నో జంతువులను వేటాడిన స్వరోచి ఆ దగ్గరలో సంచరిస్తున్న అడవిపందిని చూశాడు. అది నల్లగా కాటుక కొండలా వుంది. గుర్రుమంటూ తిరుగుతున్న ఆ పందిని వెంటనే కొట్టాలని ధనుస్సున బాణంతొడిగాడు స్వరోచి. అంతలోనే అతనికి అడ్డంగా ఒక ఆడులేడి వచ్చి నిలబడింది.

ఆ లేడి నల్లని కళ్ళు ముచ్చట గొలుపుతుంటే స్వరోచి ముందుకు వచ్చి నిల్చాడు.

" ఈ వరాహం మిమ్మల్నేమీ చేయలేదు - అనవసరంగా దాన్నెందుకు చంపుతారు" - స్వరోచికి మృగాల, పక్షుల భాషలు తెలియటం వల్ల, జింక మాటలకు ఆశ్చర్యం కలిగింది.

'నేను మృగయా వినోదుడనుగా - స్వరోచి ఆ ఆడులేడి కళ్ళవంకే చూస్తూ అన్నాడు.

"దానిని దయతో వదిలేసి, నన్ను చంపు" మహారాజు ఆ మాటలకు ఆశ్చర్యం చెందాడు.

"నీకు జీవితం పై ఆశలేదా - ఎందుకీ విరక్తి" - స్వరోచి మాటలకు మౌనంగా తలపంకించింది.

'పరస్త్రీల యందు ఇష్టం గల పురుషుని ప్రేమించటం కంటే మరణమే మేలు' -ఆడులేడి వంచిన తలఎత్తకుండానే అంది.

"ఓ అదా, నువ్వెవరిని ప్రేమించావు" -నవ్వాడు సర్వోచి.

"నా మనసు నీపైనే లగ్నమయింది, ఈ మదనతాపం చల్లారాలంటే నీ పొందు తప్పదు"-

స్వరోచికి నోట మాటరాలేదు. తను మానవుడు, ఆమె మృగాంగన...ఇదెలాసాధ్యం.

ఆలోచనా మగ్నుడైన స్వరోచి వంక చూస్తూ చిరునవ్వుతో, "మహారాజా నీ మనసులోవున్న అనుమానం నాకు తెలుసు - నేను మృగాంగననని కదూ నీ సందేహం, ఒక్కసారి నన్ను కౌగలించుకో, చాలు" ప్రాధేయపడింది ఆడులేడి.

స్వరోచి ఆ లేడిని, దగ్గరకు తీసుకోటమే ఆలస్యంగా ఆమె నవయౌవ్వన రూపలావణ్య శోభితురాలైనా మానవాంగనాకారంతో స్వరోచి కళ్ళఎదుట నిల్చింది. ఆ విచిత్రానికి ఆశ్చర్యపోతున్నాడు స్వరోచి. ఆ సుందరి స్వరోచి చెంగటనిల్చి,

"మహారాజా, నేనే వనదేవతను. దేవతల కోర్కెపై నీకడకు వచ్చాను. నీ వలన నాకు కలిగే పుత్రుడు నీకు పుణ్యలోకాలు ప్రసాదిస్తాడు"-

క్రీ గంట చూస్తోంది వనదేవత. స్వరోచి ఆనందంతో ఆమెను కౌగిలిలో బంధించాడు.

స్వారోచిష మనువు జన్మించిన శుభసమయంలో దేవదుందుభులు మ్రోగాయి. పుష్పవృష్టి కురిసింది.

వనదేవత ఆనందం పట్టరానిదైంది. మహావిష్ణు భక్తుడయ్యాడు స్వారోచిష మనువు నీతిని, ధర్మాన్ని నిలిపి భూమినేలుమని ఆశీర్వదించాడు విష్ణువు.

దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తూ పరిపాలన సాగిస్తున్న స్వారోచిష మనువును చూస్తూ, స్వరోచి మహారాజు చిత్రమైన అనుభూతిని పొందాడు.

గతం అతని కళ్ళ ముందు నిల్చింది.

ఆనాడు తాను తన భార్యలతో సరోవర విహారానందంలో తేలియాడు చున్నాడు. ఆ సరస్సులోని ఒక ఆడు హంస తన స్నేహితురాలైన చక్రవాకాంగనను పిల్చి, "చెలీ, చూడు, ఆ స్వరోచిమహారాజు, ముగ్గురు భార్యలతో కలసి విహరిస్తున్నాడు ఆ స్త్రీల అన్యోన్యానురాగం ఎంతగొప్పదో" అంది.

వెంటనే చక్రవాకంగనకు కోపం వచ్చింది. "నీవు ఊరికే పొగడకు, ఒక పురుషునికి చాలామంది స్త్రీలపైగాని, ఒక స్త్రీకి చాలామంది పురుషులపైగాని ప్రేమ వుండదు. ఈ స్త్రీలపై అతనికి ఏ ప్రేమాలేదు" అంది వెంటనే.

వారికీ ఈ రాజుపై ప్రేమలేదు. కాకపోతే, దాసీజనం ఒకరి స్వాధీనంలో వున్నట్టుగా వీరంతా -" చక్రవాకాంగన ఏదో చెప్పిపోయింది.

"నెమ్మది-ఈ మహారాజు మనమాటలు వింటున్నట్టు నాకనిపిస్తోంది" అంది హంసాంగన. నిజంగానే ఆ మాటలు విన్న, అర్థం చేసుకొన్న స్వరోచి మహారాజు ముఖం వెలవెల పోయింది.

అక్కడ నుంచి లేచివెళ్ళి భార్యలతో విహరిస్తున్న స్వరోచి ఒక మగలేడిని చూశాడు. అది తక్కిన ఆడలేళ్ళతో "నేను స్వరోచిని కాను....ఎల్ల వేళల సిగ్గు విడిచి రమించేందుకు - మీరు ఎక్కడికైనా పొండి" కసిరికొట్టాడు.

అదీ విన్నాడు స్వరోచి. ఈ మాటూ ముఖం వివర్ణమయింది, కానీ స్వరోచి భార్యల సాంగత్యం వదలలేక ఎన్ని సంవత్సరాలో వారితో కాలం గడిపాదు- గతమంతా స్వరోచి మహారాజుకి ఆశ్చర్యాన్ని కలిగిస్తోంటే, పట్టాభిషక్తుడైన స్వారోచిష మనువు వంక కంటి రెప్పపాటులేక చూశాడు. ఆనాడు అడులేడిని కౌగిలించుకొన్న తను, వనదేవతమై ప్రత్యక్షమయిన ఆమెను తమ కుమారుదు స్వారోచిష మనువును తల్చుకుంటూ, నెరసిన తలవెంట్రుకలను సరి చేసుకొన్నాడు స్వరోచి మహారాజు తృప్తిగా.

తన కొడుకు స్వారోచిష మనువై మహాకీర్తివంతుడై వర్ధిల్లడం కంటె తనకి కావలసిందేముంది అనుకుంటున్న స్వరోచి మహారాజు మనః ఫలకం పై వనదేవత రూపం నిలుస్తుంటే, నవ్వుకొన్నాదు స్వరోచి మహారాజు ముసి ముసిగా.

– కావ్యతారలు – వనిత అక్టోబర్ 1989